# శ్రీరామదూతం శిరసా నమామి



ఉప్పులూరి కామేశ్వరరావు

# శ్రీరామదూతం శిరసా నమామి



ఉప్పలూరి కామేశ్వరరావు

2014

# SRIRAMDUTHAM SIRASA NAMAMI

by

**V. Kameswara Rao**

© Author

First Edition

**January 2014**

Publishers

**V. Kameswara Rao**

C-502, SB Hemadri Towers,

Bagh Ameeri, Kukatpally,

HYDERABAD - 500072

040-23060460

Cover & Layout Design

**K. Ramakrishna**

For Copies

**Sri Jayalakshmi Publications**

2-22-310/97C, Western Hills,

JNTU Post Office, Kukatpally,

HYDERABAD - 500085

040-23050986

Printed at

**Rainbow Printpack,**

Ameerpet, Hyderabad.

Price : **Rs. 100.00**

# పెర్సనాలిటీ ఎథిక్‌కి రోల్‌మోడల్

రామాయణంలో మారుతి పాత్రని మీరు విశ్లేషించిన తీరు ఇంతవరకూ ఎప్పుడూ చూడనిది.

ఈ పుస్తకం చదువుతూంటే వాల్మీకి మహర్షి మనని ఎంత ఆలోచింపచేసారు! – అనిపించింది.

ప్రస్తుత భారత యువతకి ఒక ఆదర్శపురుషుడు కావాలి. ఒక హనుమంతుడు, ఒక వివేకానంద స్వామి మాత్రమే అటువంటి ఆదర్శమూర్తి కాగలరు. ఆదర్శవంతుడైన హనుమంతుడి పాత్రద్వారా మానవుడి నిత్యజీవితానికి కావలసిన కౌన్సిలింగ్ వాల్మీకి ఎలా చేసారో ఈ రచనలో ప్రతి పేజీలోనూ ఉంది.

భగవంతుడిచ్చిన జీవితాన్ని ఆనందంగా గడపడానికి శారీరకంగా ఆరోగ్యం, బలం కావాలి. అంతకంటే ఎక్కువగా మానసికమైన ఆరోగ్యం, ఆటుపోట్లకు ప్రభావితం కాని చిత్త స్థైర్యం, ప్రలోభాలు ఎదురవగానే చలించిపోకుండా ఉండే మనోనిగ్రహం కావాలి. ఇదీ వాల్మీకి సందేశం.

ఈ సందేశం ఆ తరానికి ఎంత అవసరమయిందో అంతకంటే ఎక్కువగా ఈ తరానికి అవసరం అని అందరికీ అర్థమయేలా, చదివి పాటించాలనిపించేలా వ్రాసారు.

సీత పాత్రని మీరు చూపించిన తీరు గురించి ఒక్కటే మాట – అద్భుతం. సీత పాత్రని విశ్లేషిస్తూ ఇటువంటి మరొక పుస్తకం మీరు రచించాలని నా అభిలాష.

**-Dr. B Adilakshmi M.D., D.M.,**
**Associate Professor (Cardiology),**
**VISAKHAPATNAM.**

తెలుగులో వచ్చిన ఎన్నో రామాయణాలు చదివాను – కంటితో.

“శ్రీరామదూతం శిరసా నమామి” మనస్సుతో చదివాను. ఈ గ్రంథం నా హృదయాన్ని స్పృశించింది.

నేటి యువతరం జీవితంలో ఎన్నో ఉన్నత లక్ష్యాలని సాధించాలని మొక్కవోని దీక్షతో కృషి చేస్తోంది. ఆ లక్ష్యాలని సాధించే క్రమంలో ఊహించని ఎన్నో విఘ్నాలూ, ప్రలోభాలూ,

ప్రమాదాలూ ఎదురౌతాయి. వాటిని ఎలా అధిగమించాలో హనుమంతుడి పాత్రద్వారా ప్రతి వాక్యంలోనూ, ప్రామాణికంగా శ్లోకాలు ఇస్తూ, చూపించారు.

ఈ యువతరానికి హనుమంతుడే ఆదర్శం. ఒక్క యువతరానికే కాదు, అన్ని తరాలకూ ఆయనే ఆదర్శం అని నా నమ్మకం.

ఒక ఆదర్శపురుషుడికి ఉండవలసిన పెర్సనాలిటీ ఎథిక్, పదిమందితో కలిసి పనిచెయ్యడానికి కావలసిన కార్పొరేట్ ఎథిక్స్, లీడర్‌షిప్ క్వాలిటీస్ – ఇలా ఆధునిక కాలానికి కావలసినవి ఎన్ని చెప్పవచ్చో అన్నిటికీ రోల్‌మోడల్ హనుమంతుడు.

ధైర్యం, ఓర్పు, నేర్పు, నీతి, వినయం, కార్యసాధనలో దృఢదీక్ష, సమయస్ఫూర్తి – ఇవన్నీ ప్రతి వ్యక్తీ అలవరుచుకోవాలని హనుమంతుడి పాత్రద్వారా వాల్మీకి ఇచ్చిన సందేశాన్ని మనస్సుకు హత్తేలా ఈ కథనంలో మీరు చూపించారు.

రామాయణ కథ అందరికీ తెలిసినదే. అందులో వాక్యాలకి మీరు ఇచ్చిన విశ్లేషణే అపూర్వం.

ఈ రచనలో అనేక వాక్యాలు quotable quotes.

**- K. V. Rangamsetty**
**Superintending Engineer (Retd)**
**Panchayat Raj Department**.

శ్రీమద్రామాయణంలో శ్రీహనుమంతుని పాత్రని ఇతివృత్తంగా తీసుకుని మీరు రచించిన "శ్రీరామదూతం శిరసా నమామి" చదివాను.

కథ విఖ్యాతమైన విషయమే. ఆచంద్రతారార్కం నిలిచిపోయే శ్రీరామకథలోని కొలికిపూస అయిన హనుమయ్య గురించి కనుక.

కథనం గురించి రెండు మాటలు చెప్పాలి. మీరు చిరకాలం గణిత, భౌతికశాస్త్రాలు అధ్యాపనం చేయించినవారు గనుక, చాలా క్లిష్టమైన విషయాన్ని కూడా తేలికగా అర్థమయేలా చెప్పడం మీకు కొట్టినపిండి.

అదే శైలి మీరు ఇంతకుముందు రచించిన శ్రీమద్రామాయణము, సుందరకాండలతో పాటు ఇక్కడ కూడా కనిపిస్తుంది.

ఈ రోజుల్లో రైతులేమిటి, విద్యార్థులేమిటి, గృహిణులేమిటి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులేమిటి అయిన దానికీ కానిదానికీ ఆత్మహత్యే శరణ్యం అనుకుంటున్నారని పత్రికలలో చదువుతున్నాం.

రామాయణంలోని హనుమయ్య వీరందరినీ నిరాశా నిస్పృహలనుంచి బయటకు లాగి కార్యసాధకులను చేయుగాక!

**- Cdr. Angara Subbarao (Retd)**

కావ్యేషు నాటకం రమ్యం.

రామాయణ మహాకావ్యానికి మణిపూస అయిన మారుతి చరిత్రని ఇందుపల్లి గ్రామంలో విష్ణ్వాలయం వేదికగా; భక్తితో కూర్చిన మల్లెల మాలలూ, నీరాజన మంత్రపుష్పాలూ వేదిక పవిత్రతకి ప్రతీకలుగా; ఆచార్యులుగారూ, ఆండాళ్ళమ్మగారూ, యోగ్యులైన బాలలూ ప్రేక్షకులుగా; నలుగురు మిత్రులు పాత్రధారులుగా మీరు నాటకీయంగా ఆవిష్కరించిన విధానం నన్ను ఎంతో ఆకట్టుకుంది.

ఇంకొకలా చెప్పాలంటే త్రేతాయుగాన్ని లైవ్ టెలీకాస్ట్ చేసారు.

మీ "శ్రీరామదూతం శిరసా నమామి" గ్రంథాన్ని ఆనందిస్తూ చదివాను. తరువాత పరిశీలిస్తూ చదివాను. మరింత ఆనందించాను.

మీరు ధన్యులు. మీకు నా ఆశీస్సులు.

**–గరికిపాటి సూర్యనారాయణమూర్తి**
**(గరికిపాటి మేస్టారు)**
**కవి, పండితులు. కాకినాడ.**

నేను మీ విద్యార్థినిని. మీరు మాకు మొదటి క్లాసులో ఒక శ్లోకం చెప్పారు.

**క్షణశః కణశశ్చైవ విద్యామర్థం చ సాధయేత్,**
**క్షణత్యాగే కుతో విద్యా కణత్యాగే కుతో ధనమ్.**

దీనిని నిత్యం మననం చేసుకోమని చెప్పారు.

నేను ప్రతీ సంవత్సరం కొత్త బ్యాచ్‌కి విధిగా ఇదే శ్లోకం చెప్పి పాఠం మొదలు పెడుతున్నాను.

అయితే ఈ శ్లోకాన్ని మాకు చెప్పడమే కాదు, మీరు స్వయంగా ఈ నాటికీ పాటిస్తున్నారని "శ్రీరామదూతం శిరసా నమామి" చదివాక నాకు తెలిసింది. మంచి మాటలు చాలామంది చెప్తారు. వాటిని ఆచరించేవారు అరుదు. అటువంటి అరుదైన గురువుగారు మీరు.

ఇంతకాలం మీ కుడిచెయ్యి ఫిజిక్స్ పాఠాలు వ్రాసింది. ఇప్పుడు ఫిజిక్స్ ఎడమచేతికి వెళ్ళింది. రామాయణం కుడిచేతికి వచ్చింది. మీరు సవ్యసాచి అయారు.

ఆ సామర్థ్యం మీకు ఎలా పట్టుబడిందో మీరే చెప్పారు.

ప్రాతఃస్మరణీయులు, ఆర్షవిద్యాసరస్వతి బ్రహ్మశ్రీ పుల్లెల శ్రీరామచంద్రుడుగారి ఆశీస్సులు లభించడం, వారి హృదయంలో స్థానం పొందగలగడం మీ పూర్వ జన్మ సుకృతమని చెప్పారు.అది మీకు అదృష్టం. మాకు గర్వకారణం.

సుందరకాండ అనేక సార్లు పారాయణ చేసాను కనుక శ్లోకాలు అలవాటైనవే. అర్థాలు తెలిసినవే. కాని, మీరిచ్చిన విశ్లేషణ చదివాక రామాయణాన్ని కొత్తకోణంలో చూసాను. మీ రచనలో అన్నీ తెలిసిన మాటలే. అన్నిటికీ అందరికీ తెలిసిన అర్థాలే. అయినా చదువుతూంటే అద్భుతం అనిపించింది.

**-గంటి బాలాత్రిపురసుందరి,**
**సీనియర్ సంస్కృతం లెక్చరర్.**

# ఎందరో మహానుభావులు

ఈ రచన చేయడానికి నాకు స్ఫూర్తినిచ్చిన మహనీయులెందరో ఉన్నారు.

పన్నెండు సంవత్సరాల వయస్సులో ఉండగా గొప్ప పండితులు, రామాయణంలో ఒక్కొక్క శ్లోకం చక్కగా వివరించి చెప్పిన ఉపన్యాసకులు, శ్రీకడియాల సీతారామశాస్త్రిగారు రామాయణంమీద ఆసక్తి కలిగించారు.

ఇరవై సంవత్సరాల వయస్సులో, కొంత అర్థంచేసుకునే స్థితిలో ఉండగా శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యులుగారు రామాయణాన్ని భక్తివేదంగా అర్థంచేసుకోవడం నేర్పించారు.

అరవై సంవత్సరాలు నిండాక ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు రామాయణాన్ని విశ్లేషించుకుని చదవడం, కావ్యంగా ఆస్వాదించడం, వేదోపబృంహణంగా అధ్యయనం చెయ్యడం నేర్పారు.

ఇందరు మహాత్ములు నేర్పాక ఎవరికైనా విషయం ఎంతో కొంత ఒంటపడుతుంది.

వీరందరి ఆశీస్సుల బలమే ఈ రచన.

దీనిని తమ పత్రికలో ప్రచురించిన ఆంధ్రభూమి సంపాదకులకు, పుస్తకంగా తీసుకు వచ్చేందుకు అనుమతించిన మేనేజ్‌మెంటుకి కృతజ్ఞుడిని.

**–ఉప్పులూరి కామేశ్వరరావు**

# శ్రీరామదూతం శిరసా నమామి

ఇందుపల్లి కోనసీమలో అమలాపురానికి దగ్గరలో ఉన్న చిన్న గ్రామం. కోనసీమ అందాలన్నీ ఆ ఊళ్ళోనూ ఉన్నాయి.

ఊరు చేరుతూంటే దారికి ఇరువైపులా బారులు తీరి కొబ్బరిచెట్లుంటాయి. అలిసిపోయి వచ్చే అతిథుల్ని ఆహ్వానించడానికి గొడుగులు విప్పి పట్టుకుని నిలబడి నిరీక్షిస్తున్న గృహస్థులలా ఉంటాయి ఆ చెట్లు.

చిక్కని అరటితోటలూ, మామిడి చెట్లూ, పనస చెట్లూ, వీటన్నిటి మధ్యలో జితేంద్రియులలా స్థిరంగా నిలబడిన చింతచెట్లూ, పచ్చటి వరి పొలాలూ చూసే వారికి కనువిందు చేస్తుంటాయి.

ఈదరపల్లి వంతెనమంచి దిగువన ఉన్న ఇందుపల్లికి గోదావరికాలవగట్టే దారి. అమలాపురంనుంచి ఇందుపల్లికి వెళ్ళేవారికి తోడుగా ఆ గోదావరి కాలవలో నీరు మెల్లగా ప్రవహిస్తూ వస్తుంది. ప్రయాణంలో దూరం తెలియనివ్వకుండా ఆప్యాయంగా మాట్లాడుతూ కూడా వచ్చే ఆప్తమిత్రుడిలా మెల్లగా సడిచేస్తూ కదులుతుంది.

కొబ్బరిచెట్లను చుట్టుకుని, అరటితోటలమీదుగా షికారు చేసి, ఇందుపల్లికి వెళ్ళే గోదావరి కాలవని ప్రేమగా తట్టి పలకరించి, కనుచూపు మేరంతా వైదూర్యమణులు పరిచినట్లున్న ఎదిగిన వరిచేలమీద అలలు సృష్టిస్తూ కదిలి, కమలేశ్వర టాకీసు మీదనుంచి అమలాపురంలో ప్రవేశించే పైరగాలి కాలువగట్టున నడిచే వారికి మెత్తగా మత్తుగా తగులుతూ కలిగించే మధురానుభూతి మాటలకందనిది. అది అనుభవిస్తేనే తెలుస్తుంది.

రాముణ్ణి అరణ్యవాసం మాన్పించి, అరణ్యంలోనే రాజ్యాభిషేకం చేయించి, చక్రవర్తి మర్యాదలతో అయోధ్యకు తీసుకువచ్చేందుకు భరతుడు మహాసైన్యంతో బయల్దేరాడు. దారిలో భరద్వాజమహర్షి భరతుడికీ, అతడి సైన్యానికీ ఊహాతీతమైన అద్భుతమైన విందు ఏర్పాటు చేసాడు. ఆ విందులో అనేక వంటకాలు నోరూరించే రుచులతో తినలేనంత వండి వడ్డించారు. తృప్తులైన సైనికులు ఆనందం పట్టలేక ఇలా అన్నారు.

**"నైవాయోధ్యాం గమిష్యామో న గమిష్యామ దండకాన్,**
**కుశలం భరతస్యాస్తు రామస్యాస్తు తథా సుఖమ్.**

ఇక మేము అయోధ్యకూ రాము, దండకారణ్యానికీ రాము. మాకు ఇక్కడే బాగుంది. రాముడు క్షేమంగా ఉండుగాక. భరతుడూ క్షేమంగా ఉండుగాక. మేము మాత్రం ఈ ఆశ్రమం వదిలి రాము."

అలాగే ఇందుపల్లిలో ఉండేవాళ్ళు, 'అమెరికా క్షేమంగా ఉండుగాక! అమలాపురమూ క్షేమంగా ఉండుగాక! మాకు మాత్రం మా ఇందుపల్లి గాలికీ, ఈ నీటికీ ఏదీ సాటిరాదు. అమెరికాకంటేనూ, అమలాపురంకంటేనూ మాకు మా ఊరే మిన్న." అనుకునేవారు, రెండు మూడు తరాల వెనుక. కాలంలో వచ్చిన మార్పులతో ఆ గ్రామంనుంచి యువతీ యువకులు పెద్ద చదువులు చదివి, పెద్ద ఉద్యోగాలకోసం మహానగరాలకు వెళ్ళారు. విదేశాలకు వెళ్ళారు. గ్రామానికి కీర్తిప్రతిష్ఠలు తెచ్చారు.

ప్రభల సీతారామశాస్త్రి, నున్న శేషయ్య, సత్తి వెంకట్రెడ్డి, ముత్యాల సుబ్బారావు ఆ గ్రామంలోనే పుట్టారు. బాల్యమిత్రులు. సుబ్బారావుని అందరూ బుల్లబ్బులు అంటారు. వారందరూ పదవతరగతి వరకూ అమలాపురం బోర్డుహైస్కూల్లోనే చదివారు.

శాస్త్రిగారు, శేషయ్య, వెంకట్రెడ్డి పెద్ద చదువులు చదివి ప్రభుత్వంలో ఉన్నతపదవులు నిర్వహించారు. బుల్లబ్బులు అమలాపురంలోనే వ్యాపారం చేసి ఐశ్వర్యవంతుడయ్యాడు. ఉద్యోగాలలో ఉన్న మిత్రులంతా జీవితమలిసంధ్య ఇందుపల్లిలోనే గడపాలని నిర్ణయించుకుని వలంటరీ రిటైర్మెంటు తీసుకుని, స్వగ్రామం చేరుకుని వ్యవసాయదారులయ్యారు.

ఈ నలుగురు మిత్రులూ రోజూ సాయంత్రం గ్రామంలో ఉన్న విష్ణ్వాలయం వద్ద కలుసుకుంటారు. ఆలయప్రాంగణంలో ఒక పక్కన, ఎవరికీ అడ్డం లేకుండా నాలుగు కుర్చీలు వేసుకుని కూర్చునేందుకు ఏర్పాటు చేసుకున్నారు. ఆ సాయంత్రం సమావేశాల్లో సాహిత్యం గురించి, పురాణ ఇతిహాసాల గురించి చర్చిస్తారు. ఆ చర్చలలో శాస్త్రిగారిది కీలక పాత్ర. ఆ నలుగురు మిత్రులకూ రామాయణం ప్రాణం.

# 1

విజయనామ సంవత్సరం. చైత్రశుద్ధ దశమి.

మిత్రులంతా గుడిదగ్గర కలుసుకున్నారు. పలకరింపులయ్యాక బుల్లబ్బులు అందుకున్నాడు.

"శాస్త్రీ! మనం రామాయణంలో హనుమంతుడి పాత్ర గురించి చర్చిద్దామనుకున్నాం. చెప్పడం మొదలుపెడతావా?" అన్నాడు.

"నిన్ననే శ్రీరామనవమి అయింది. వేసవి మొదలయింది. కొబ్బరి తోటలలో బెల్లు విరిపించుకోవాలి. మామిడి తోటలు జాగ్రత్తగా చూసుకోవాలి. మోటనూతులు పూడిక తీయించుకోవాలి. ఇలా వ్యవసాయం పనులు ముమ్మరంగా ఉన్నాయి. ఈ హడావుడిలో రామాయణం చర్చ ఎందుకు?" అన్నారు శాస్త్రిగారు.

"సాయంత్రంపూట మనం చేసే వ్యవసాయం పనులు ఏముంటాయి? కాకపోయినా ఉద్ధారకులు చూసుకుంటూనే ఉంటారు. ఆపైన రోజూ గుడిదగ్గిర గంటసేపు ఎలాగూ కూర్చుంటాం. అందుచేత ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకోవడం కంటే హనుమంతుడి గురించి చెప్పుకోవడమే నయం కదా!"

"శాస్త్రికి చదువుకుందుకు టైముండొద్దా?" అన్నాడు వెంకట్రెడ్డి.

శేషయ్య నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నావు?" వెంకట్రెడ్డి అడిగాడు.

"శాస్త్రికి రామాయణకథ అంతా, వివరాలతో సహా, మనస్సులో స్పష్టంగానే ఉంది. చెప్పడానికి ఇంటిదగ్గిర ప్రిపేరవాల్సింది ఏమీ లేదు. అతడు పడాల్సిన శ్రమంతా మన ప్రశ్నలకు సమాధానం చెప్పడానికే." అన్నాడు శేషయ్య.

"అలాగైతే ఆలస్యం దేనికి? రామాయణమారుతి గురించి చెప్పు." అన్నాడు బుల్లబ్బులు ఉత్సాహంగా.

శాస్త్రిగారు ప్రశాంతంగా ప్రారంభించారు.

"నేను ఏమైనా మర్చిపోతే జ్ఞాపకం చెయ్యడానికి మీరున్నారు కదా! బుల్లబ్బులు రామాయణ మారుతి గురించి చెప్పమని బాగా అడిగాడు. రామాయణంలో హనుమంతుడి కథ ఒకలా ఉంటుంది. ఇతరపురాణాలలో కథలు కొంచెం వేరుగా ఉంటాయి. మనం రామాయణంలో హనుమంతుణ్ణి గురించి మాత్రమే చెప్పుకుందాం.

అయితే మన ఆలోచనకీ, చర్చకీ ఒక లక్ష్యం ఉండాలి.

మన తరం చిన్నతనంనుంచీ రామాయణాన్ని భక్తిగా విన్నాం. చదివాం. శ్రద్ధగా పారాయణ చేసాం. ప్రయోజనం పొందాం. ఎంతో కొంత తార్కికంగా కూడా పెద్దలు, పండితులు చెప్పగా విన్నాం.

మన పిల్లలూ, మనవలూ మనలా పెరగలేదు. మనం భక్తి అనేదాన్ని వాళ్ళు సెంటిమెంట్ అంటున్నారు. రామాయణంలో ఉన్న కథ ఇంటర్నెట్‌లో చదివిన నవలారూపంలో ఉన్న మైథాలజీ అనుకుంటున్నారు.

ఆ భావన సరైనది కాదని మన పిల్లల్ని కన్విన్స్ చెయ్యడానికి మన చర్చ ఉపయోగించేలా ఉండాలని ఇదివరకు శేషయ్య అన్నాడు. మనమంతా అంగీకరించాం. ఆ దిశగానే చర్చిద్దాం.

రామాయణం మన జాతి గర్వించదగిన కావ్యం. ప్రపంచ సాహిత్యచరిత్రలోనే ఇది ఆదికావ్యం. క్రీస్తు పుట్టడానికి కొన్నివేల సంవత్సరాల క్రితం చేసిన రచన. ఆ కాలంలో సంస్కృతం తప్ప మరే మానవభాషా పరిపూర్ణంగా రూపుదిద్దుకోలేదు.

ఆనాటికే సంస్కృతంలో శబ్దాల స్వరూపం, పదాల పుట్టుక, వాటిమధ్య సంధులు, వాటితో సమాసాలు, ఛందస్సు– ఇవన్నీ ఎంతో నిర్దిష్టంగా ఏర్పడి ఉన్నాయి. ఆనాటికీ ఈనాటికీ ఏమీ మార్పు అవసరంలేనంత లాజికల్‌గా, రెండు రెళ్ళు నాలుగు అని చెప్పినంత కచ్చితంగా రూపుదిద్దుకున్న భాష సంస్కృతం.

ఆ భాషలో వాల్మీకి రచించిన రామాయణం రెండు కారణాలవలన సాటిలేని కావ్యం అయింది.

అందులో మొదటి కారణం కావ్యనిర్మాణంలో వాల్మీకి చూపించిన కౌశలం. కావ్యంగా ఈ గ్రంథం యావత్ ప్రపంచంలోనూ నీరాజనాలు అందుకుంది.

ఈ కావ్యం ఎంత అందమైనది అని వర్ణించడానికి మేధావులు చాలా ప్రయత్నం చేసి చివరకి **శ్రీమద్రామాయణం రమ్యం శ్రీమద్రామాయణం యథా** – శ్రీమద్రామాయణం ఎంత రమ్యమైన కావ్యం అంటే శ్రీమద్రామాయణం అంత రమ్యమైనది అని తేల్చారు! దీనితో పోల్చడానికి సరిపోయేది మరొకటి లేదు అని అర్థం.

రామాయణం గొప్పదవడానికి రెండవ కారణం అది వేదానికి ఉపబృంహణమైన కావ్యం. అంటే వేదంలో క్లుప్తంగానూ, విడి విడి గానూ ఉన్న మంచి మాటలు అందరికీ అర్థమయేలా ఒక ఉత్తమమానవుడి కథ ఆధారంగా చెప్పిన కావ్యం.

వేదం హిందూమతానికే పరిమితమైన కాలంచెల్లిన ఛాందసమైన విషయాలు మాత్రమే చెప్తుంది అనే అపోహ ఈ రోజులలో చాలామందికి ఉంది. కాని, కొంచెం ఆలోచించి చూస్తే వేదకాలం నాటికి ఏ మతమూ లేదు, హిందూమతంతో సహా. ఉన్నదల్లా ఒక్కటే, మానవజాతి. ఆ మానవజాతి సుఖశాంతులతో మనుగడసాగించాలనే ఆకాంక్షతో విజ్ఞులు, సర్వసంగ పరిత్యాగులు, స్వార్థమనే మాటే తెలియని మహాత్ములు అయిన ఋషులు చెప్పిన మంచిమాటలే వేదం.

అంటే వేదం మానవులందరూ మనస్సులో ఉంచుకోవలసిన విషయాలు చెప్పింది. మానవుడు తన జీవితకాలం ఎలా సద్వినియోగం చేసుకోవాలో చెప్పింది. ఉదయం లేచినప్పటినుంచి రాత్రి నిద్రపోయేవరకూ సమయాన్ని వృథా చెయ్యవద్దని చెప్పింది. విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోమంది. నీవరకూ మంచి మనిషిగా, కుటుంబపరంగా మంచి సభ్యుడిగా, సమాజంపరంగా మంచి పౌరుడిగా జీవించమని చెప్పింది.

నిన్నటికంటే నేడు, నేటికంటే రేపు మెరుగైన జీవితం పొందడానికి పాటుపడమంది. చైతన్యవంతుడిగా ఉండమంది. అందివచ్చిన శాస్త్రీయవిజ్ఞానాన్ని వాడుకోమంది. కొత్తది సాధించడానికి కృషిచెయ్యమంది.

వేదం వ్యక్తికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా అవసరమైన అనేక ఆసక్తికరమైన విషయాలు చెప్పింది. వాటిలో చాలా విషయాలు ఆనాటికి ఎంత వర్తించాయో ఈనాటికీ అంతే వర్తిస్తాయి. వాటిని గురించి కొంతైనా తెలుసుకుంటే మన దేశంలో వేదకాలంలోనే ఎంత గొప్ప నాగరికత పరిఢవిల్లిందో తెలుస్తుంది. మీకు నమ్మకం కలగడానికి రెండు మూడు ఉదాహరణలు కుప్తంగా చెప్తాను.

సమాజం సుఖశాంతులతో ఉండాలంటే నేరాలు అరికట్టాలంది. నేరస్థుల జాడ తెలియకపోతే చక్కగా శిక్షణ ఇచ్చిన శునకాలని *(డాగ్ స్క్వాడ్స్)* వాడమని చెప్పింది. ఆ శునకాల సంరక్షణ ఎలా చెయ్యాలో చెప్పింది.

జనాభా పెరిగి పంటలు చాలకపోతే భూమిని సర్వే చేసి కొత్తగా కొంత భూమిని సాగులోకి తెమ్మంది. నదులనుంచి కాలువలు తవ్వి సాగునీరు పొలాలకి ఎలా అందించాలో చెప్పింది. ఎరువులు వాడి దిగుబడి పెంచుకోమంది.

యజమాని తనవద్ద పనిచేసే వాళ్ళకి సరైన జీతం సదుపాయాలూ అందించకపోతే అ పరివారానికి సమ్మెచేసే హక్కుందని చెప్పింది. సమ్మె ఎలా చెయ్యాలో, సమ్మెకి నోటీస్ ఎలా ఇవ్వాలో, యాజమాన్యంతో చర్చలు వినయంగానూ స్థిరంగానూ ఎలా చెయ్యాలో చెప్పింది. చర్చల సమయంలో కార్మిక సంఘాలు సిండికేటై యజమానులతో లాభదాయకంగా ఎలా చర్చించుకోవాలో చెప్పింది. చర్చలు విఫలమైతే ఆర్బిట్రేషన్ ఎవరు చెయ్యాలో, ఎలా చెయ్యాలో చెప్పింది.

ఎప్పటికప్పుడు మోడర్న్‌గానూ, డైనమిక్‌గానూ ఉండమంది. మనస్సు నిర్మలంగానూ, ప్రవర్తన ధార్మికంగానూ ఉంచుకోమని చెప్పింది.

ఇవన్నీ కృష్ణయజుర్వేదంలోనూ, అథర్వవేదంలోనూ చెప్పినమాటలు.

ఆ కాలంలోనూ బాధ్యతలు విస్మరించి, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి నిత్యం క్లబ్బులకీ, పబ్బులకీ వెళ్ళే వ్యసనపరులు ఉండేవారు.

అమూల్యమైన జీవితాన్ని ఇటువంటి పెడతోవలకు పోయి పాడుచేసుకోవద్దని, పతనావస్థకి తీసుకుపోవద్దనీ వేదం పదే పదే చెప్తుంది.

ఒకడికి జూదం బాగా అలవాటయింది. జూదగాడి భార్య, తల్లి తీరని దుఃఖానికి గురవుతున్నారు. అన్ని వైపులా అప్పులే. చేతిలో చిల్లి గవ్వయినా లేక రాత్రిళ్లు ఇతరుల ఇళ్ళలో ప్రవేశించి దొంగతనానికి పాల్పడుతున్నారు. జూదగాడు డబ్బుగల దంపతులని చూసి ఈర్ష్యపడుతున్నాడు. తనకున్న సర్వస్వాన్నీ కోల్పోయి తనపై గెలిచినవానిముందు చేతులెత్తి నిలిచి తన దగ్గర ఏమీ లేదని చెప్తున్నాడు.

ఈ కథ చెప్పి, 'ఓ జూదగాడా! జూదమాడకు. వ్యవసాయం చేసుకో. దానివల్ల కలిగే సంపదతో తృప్తిపడు. ఇది భగవంతుడు మనకిచ్చిన తీర్పు. సందేశం. ఓ దేవతలారా! మాకు మిత్రులై ఆనందాన్నిచ్చి మమ్మల్ని రక్షించండి. ఈ పాచికలకు మమ్మల్ని మళ్ళీ ఎప్పుడూ బానిసలు కానివ్వకండి.' అని ఋగ్వేదసూక్తంలో చెప్పారు.

ఇవన్నీ పాతకాలం ఆలోచనలనీ, ఈ కాలానికి వర్తించవనీ అనగలమా? ప్రాచీనకాలం కంటే ఈ కాలానికే ఇవి ఎక్కువ అవసరమేమో అనిపిస్తోంది కదా!

నిజాయితీగా ఆలోచించగలిగితే మనం ఆధునికం అనుకునే భావాలన్నీ కేవలం ఇప్పుడే పుట్టినవి కావు. మానవుడికి తెలివి ఉన్న అన్నికాలాలలోనూ ఇవి ఉన్నాయి. కాలం గడుస్తూంటే సమాజంలో మారుతున్న నాగరికత స్థాయి, మనిషికి అందివచ్చిన శాస్త్రవిజ్ఞానం ఆ భావాలకి వన్నెలూ చిన్నెలూ చేరుస్తూ వచ్చాయి. కాని, మౌలికమైన అంశాలు శాశ్వతమైనవి. వాటికి కాలపరిమితి లేదు. దేశాల ఎల్లలు లేవు. మతాల అడ్డుగోడలూ లేవు.

మానవజీవితానికి అవసరమైన ఎన్నో మంచి మాటలు రామకథలో అంతర్వాహినిగా చేర్చి రమ్యమైన కావ్యంగా రామాయణాన్ని కూర్చారు వాల్మీకి మహర్షి.

రామకథ ఎన్నిసార్లు విన్నా ప్రతిసారీ మధురంగానే ఉంటుంది. ఎవరు వింటే వారికి తమకోసమే చెప్తూన్నట్లు ఉంటుంది.

ఈ రామాయణ రచనకి తాను వేసుకున్న ప్రణాళికని మహర్షి బాలకాండ మూడవసర్గలో వర్ణించారు. ఒక్కొక్క గొప్ప విషయం చెప్పడానికీ, దానికి ఉదాహరణలు చూపించడానికీ ఒక్కొక్క పాత్రని ఎంచుకున్నారు. ఈ కథలో రెండు పాత్రలు మిగిలినవాటికంటే చాలా భిన్నమైనవి. ప్రత్యేకమైనవి. అవి లక్ష్మణుడు, హనుమంతుడు.

వీరిద్దరూ కోరి రాముడికి దాసులయ్యారు. 'నేను రాముడికి దాసుణ్ణి.' అని తమంత తామే చెప్పారు. లక్ష్మణుడు పుట్టుకనుంచీ రాముడితో కలిసి ఉన్నాడు. అతణ్ణి గురించి బాగా తెలిసినవాడు. మానవులలో శ్రేష్ఠుడైన రాముడి సాన్నిహిత్యం కంటే తనకి వేరే ఏమీ అక్కర లేదనుకున్నాడు. తన జీవితం రాముడికే అంకితం చేసాడు.

**'అహమస్యావరో భ్రాతా గుణైర్దాస్యముపాగతః,**
**కృతజ్ఞస్య బహుజ్ఞస్య లక్ష్మణో నామ నామతః.**

నేను రాముడి తమ్ముణ్ణి. నాపేరు లక్ష్మణుడు. ఈ రాముడు కృతజ్ఞుడు. అనేక విషయాలు తెలిసినవాడు. ఇతడి గుణగణాలు చూసి నా అంత నేను కోరి ఇతడికి దాసుణ్ణయ్యాను.' అన్నాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sriramadutam+Sirasa+Namami**

* * *